ఎట్టకేలకు దొంగ దొరికాడు

- ఊపిరిపీల్చుకున్న రైతులు
- చుట్టుపక్కల మండలాల్లో 27 కేసులు
- ముఠా ఉందాననే అనుమానం

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో ఉన్న రాగి తీగను తస్కరించే దొంగ ఎట్టకేలకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. అయితే ఒక్కడే ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టేందుకు సాహసించలేడని అతడితో పాటు మరికొంత మంది ఉంటారని రైతులు అనుమానిస్తున్నారు. 27 కేసులున్న ప్రసాద్‌ను పొదలకూరు పోలీసులు శుక్రవారం చాకచక్యంగా పట్టుకున్న విషయం తెలిసిందే. విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రసాద్ పొదలకూరు మండలంతోపాటు నెల్లూరు రూరల్, వెంకటాచలం, ముత్తుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, తోటపల్లి గూడూరు తదితర మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మల దొంగతనాలకు పాల్పడ్డాడు.

రైతుల ఇబ్బందులు

రైతులు నిమ్మతోటలు సాగు కోసం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటి దొంగతనం జరిగితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు పోలీస్ ఎఫ్ఆర్ఐ కాపీ తీసుకున్న తర్వాత కొత్తది బిగించాల్సి ఉంటుంది. అయితే ఈ తంతు పూర్తి కావాలంటే సుమారు పది రోజులు లేదా నెల రోజుల సమయం పడుతుంది. ఈలోగా నిమ్మతోటలకు నీరు పెట్టుకోవాలంటే రైతులు అష్టకష్టాలు పడాల్సిందే. గతంలో కూడా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనానికి సంబంధించి ఓ ముఠా సంచరిస్తుండగా పోలీసులు పట్టుకుని వైర్లు రికవరీ చేశారు. తర్వాత కొంతకాలం దొంగతనాలు ఆగాయి. మళ్లీ ఇటీవల ముదిగేడు, ఆల్తుర్తి, మొగళ్లూరు, కసుపర్తి, డేగపూడి తదితర ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు జరిగాయి. ఎట్టకేలకు ఎస్సై హనీఫ్ నిందితుడు ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 90 కిలోల కాపర్ తీగలు, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అతడి వెంట ముఠా ఏదైనా ఉందా? అనే కోణంలో కూడా దర్యాప్తు జరుగుతున్నట్టు తెలుస్తోంది.



ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దృశ్యం (ఫైల్)



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు (ఫైల్)

ఒత్తిడికి గురికావొద్దు

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: 'విద్యార్థులు, అధ్యాపకులు ఒత్తిడికి గురికావొద్దు. దానిని సమర్థవంతంగా ఎదుర్కొనే తీరును అలవర్చుకోవాలి' అని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు సూచించారు. ఒత్తిడి నిర్వహణపై మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో శనివారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఒత్తిడి సహజమేనని, దానిని సానుకూల దృక్పథంతో ఎలా ఎదుర్కోవాలో ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని తెలియజేశారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వీఎస్‌యూ తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ ఒత్తిడి మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతుందని తెలియజేశారు. ఒత్తిడి అధికంగా ఉండటం వల్ల నిద్రలేమి, మానసిక ఆందోళన, మైగ్రేన్, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం, యోగా, వ్యాయామం చాలా కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించగలమనే సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. సమతుల్య ఆహారం, మంచి నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి మనసుకు ప్రశాంతతను అందిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

క్లుప్తంగా

వైభవంగా పల్లకి సేవ



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా ప్రసాద్ – హేమ దంపతులు వ్యవహరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జ్యోతి

కొడవలూరు: శిక్షణలో తెలుసుకున్న అంశాలను అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల్లో అమలు చేస్తే చిన్నారులు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని కోవూరు సీడీపీఓ జ్యోతి సూచించారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు కొడవలూరు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 26 మందికి ఉద్యోగాలు



విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను హీరో మోటార్ కార్ప్, డైకిన్ సంస్థల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుజాత మాట్లాడారు. 26 మందిని ఎంపిక చేసి వారికి నియామక పత్రాలను అందజేశారని వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలను నిర్వహించేందుకు తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



విడవలూరు: మండలంలోని ఊటుకూరుకు చెందిన దేవరపల్లి శ్రీనివాసులురెడ్డి కుమార్తె వైష్ణవిశంకరి, చైతన్యరెడ్డి వివాహ వేడుకలను నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వధూవరులను మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆశీర్వదించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబు, విడవలూరు మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి, కోవూరు వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



కొడవలూరు: మండల పరిధిలోని జాతీయ రహదారిని పొగమంచు శనివారం కమ్మేసింది. ఉదయం ఎనిమిది గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొనడంతో వాహనాలు రాకపోకలు సాగించలేకపోయాయి. లారీలను ఎక్కడికక్కడ రోడ్డు పక్కన నిలిపేశారు. తర్వాత మంచు పొరలు తగ్గుతూ వచ్చాయి.

ఏప్రిల్ 14న పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం): తెలుగు రాష్ట్రాల పరిధిలో విభిన్న రంగాలకు చెందిన ప్రతిభావంతులకు పురస్కారాలను ఏప్రిల్ 14న అందజేయనున్నామని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్‌రాయ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మాగుంట లేఅవుట్లోని ఓ హోటల్లో శనివారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. గ్లోబల్ పీస్ సమ్మిట్, అమెరికన్ యూనివర్సిటీ, కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీటిని ప్రదానం చేయనున్నారని వివరించారు. అనంతరం హరినారాయణరెడ్డి మాట్లాడారు. దరఖాస్తులను ఆహ్వానించి, పరిశీలన అనంతరం పురస్కారాలను అందజేయనున్నామని చెప్పారు. వివరాలకు 98480 34522, 99488 44500 నంబర్లను సంప్రదించాలని సూచించారు. రాయ్ జెసన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

పొదలకూరు: రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. టీచర్లు వారిని శనివారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఫెర్సిస్ మాట్లాడుతూ 9వ తరగతి చదువుతున్న కె.చందనప్రియ, బి.శృతి, 8వ తరగతి చదువుతున్న ఎస్.స్వప్నప్రియలు ప్రతిభ చూపి ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు చంద్రగిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వై.నాగిరెడ్డి, ఎస్ఏపీఈ వి.పార్వతి, పీఈటీ జీ.సునంద తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం / విడవలూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ కోవూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఆనపల్లి ఉదయభాస్కర్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలను తెలియజేశారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, పార్టీ బుచ్చి మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, నగరాధ్యక్షుడు షాహుల్, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, కాలువ బాలశంకర్‌రెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డికి ప్రసన్న పరామర్శ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని సొల్మన్‌పురంలో సన్నపరెడ్డి నరసింహారెడ్డి తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో శనివారం నిర్వహించిన కర్మక్రియలకు మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, జయరామ్‌రెడ్డి, కాలువ బాలశంకర్‌రెడ్డి, మోర్ల భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

పొదలకూరు: పట్టణంలో కమర్షియల్ విద్యుత్ వినియోగదారులకు ఇటీవల స్మార్ట్ మీటర్లను బిగించారు. ఈ ప్రక్రియను దాదాపుగా విద్యుత్ అధికారులు పూర్తి చేశారు. అయితే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినప్పటి నుంచి బిల్లులు పెరిగినట్టు కొందరు వినియోగదారులు ఆరోపించారు. పొదలకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గృహాలు, షాపులు కలిపి 16 వేల విద్యుత్ కనెక్షన్లున్నాయి. మరో 6 వేల వ్యవసాయ కనెక్షన్లున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపారస్తులకు స్మార్ట్ మీటర్లను బిగించడంతో వారిలో కొందరికి తరచూ బిల్లుల్లో తేడా వస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెలలో ఓ వాహన వాటర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడికి రూ.4.41 లక్షల బిల్లు అందజేశారు. ఇదే తరహాలో మరికొందరికి రూ.వేలల్లో వచ్చినట్టు చెప్పారు. ఫలితంగా స్మార్ట్ మీటర్లంటే వినియోగదారులు భయపడుతున్నారు. కొంత సమయం తీసుకుని గృహ వినియోగదారులకు సైతం స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



స్మార్ట్ మీటర్

దివ్యాంగుల హక్కులను కాపాడుదాం



పొదలకూరు: సదస్సుకు హాజరైన అంగన్‌వాడీ టీచర్లు

మనుబోలు: దివ్యాంగుల హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. పోషణ్ బీ – పఢాయి బీ శిక్షణా కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన శనివారం మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల చట్టాలు, హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగలను తక్కువ చేసి చూడొద్దన్నారు. వారికి ఆత్మవిశ్వాసాన్నిస్తే ఏదైనా సాధించగలరని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, పద్మజ, ఆదినారాయణమ్మ, ఐఆర్టీ శ్యామల పాల్గొన్నారు.

- పొదలకూరు: మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో మూడురోజులపాటు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. తొలి రోజున పిల్లల్లో జరిగే అభివృద్ధి, ఈసీసీఈ డే, రెండో రోజున పౌష్టికాహారం, పిల్లల ఎత్తు బరువు, మూడో రోజున అంగవైకల్యం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుల్లో ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, ఎంఈఓ రేణుక, వైద్యాధికారి కావ్యశ్రీ, సూపర్‌వైజర్లు జ్యోతిలక్ష్మి, ఆదినారాయణమ్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు: మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి

పైప్‌లైన్ పనులు వాయిదా వేయాలి

తోటపల్లిగూడూరు: రైతుల పంట పొలాల మధ్య భారత్ పెట్రోలియం సంస్థ నిర్వహిస్తున్న పైప్‌లైన్ పనులను వెంటనే వాయిదా వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం సీపీఎం నాయకులతో కలిసి ఆయన తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్‌కు భారత్ పెట్రోలియం సంస్థ ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా పంట పొలాల్లో మధ్య పైప్‌లైన్ ఏర్పాటుకు అందరిలాగే పేడూరు పంచాయతీ రైతులు అంగీకారం తెలపడం జరిగిందన్నారు. వరి పంట కోత దశకు చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలో పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారన్నారు. ముందస్తు నోటీసులివ్వకుండా కోతల సమయంలో ఇలా చేయడం దారుణమన్నారు. కోతలు పూర్తయ్యాక పనులు మొదలుపెట్టాలని అడుతున్నా పొలాలను నాశనం చేయడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని పేడూరు పంట పొలాల్లో పైప్‌లైన్ పనులను వెంటనే నిలుపుదల చేయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుబోయిన రాజా, ఈపూరు లక్ష్మయ్య, బండి శౌరి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు

శివపార్వతుల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

మనుబోలు: ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణోత్సవానికి ఏర్పాట్లను భక్తులు శనివారం ప్రారంభించారు. రైల్వే గేటు సమీపంలోని విశ్వనాథస్వామి ఆలయం వద్ద మహాగణపతి పూజ తదితరాలను అర్చకుడు శ్రీనివాసులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే విశ్వనాథస్వామికి రుద్రాభిషేకం, వెంకయ్యస్వామికి పంచామృతాభిషేకాలను చేశారు. శివపార్వతుల కల్యాణోత్సవానికి పసుపు దంచే కార్యక్రమాన్ని నిర్వహించారు.



పసుపు దంచుతున్న భక్తులు

రైతుల విశిష్ట సంఖ్యపై ప్రత్యేక దృష్టి

కొడవలూరు: రైతుల విశిష్ట సంఖ్య నమోదుపై వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నమోదుపై లక్ష్యాలను నిర్దేశించడంతో రైతులను ప్రోత్సహించి ప్రక్రియ జరిపేందుకు వ్యవసాయ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. రాయితీలు, రుణాలు తదితరాలను దీని ఆధారంగానే అందజేయనున్నామని ప్రభుత్వం ప్రకటించడంతో, విశిష్ట సంఖ్య నమోదుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో ఈ నెలాఖరు నాటికి మూడు వేల మంది రైతులకు విశిష్ట సంఖ్యను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీంతో రైతు సేవా కేంద్రాలతో పాటు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో నమోదు చేస్తున్నారు. మండలంలో ఇప్పటికే 1100 మంది రైతులకు నమోదు చేశారు. ప్రక్రియను మరింత వేగవంతం చేసి నెలాఖరులోపు లక్ష్యాన్ని సాధిస్తామని ఏఓ లక్ష్మి తెలిపారు.



పాఠశాల విలీనాన్ని అంగీకరించేదిలేదు



పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

నెల్లూరు సిటీ: గుడిపల్లిపాడులో దాదాపు 34 ఏళ్లుగా నిర్వహిస్తున్న పాఠశాలలో 3, 4, 5వ తరగతుల విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలోని అల్లీపురం ఎంపీపీఎస్ పాఠశాలలో విలీనం చేయాలనే నిర్ణయాన్ని తాము అంగీకరించేదిలేదని విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం చేపట్టిన ఆందోళనలో వారు మాట్లాడారు. పాఠశాలలో 53 మంది చదువుకుంటున్నారని, అయితే అల్లీపురం మెయిన్ రోడ్డులోని ఎంపీపీఎస్ పాఠశాలలో విలీనం చేస్తున్నారని చెప్పారు. ప్రధాన రహదారిలో పిల్లలు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల చైర్‌పర్సన్ శైలమ్మ, వైస్ చైర్‌పర్సన్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

వెంకటాచలం: పరిసరాల పరిశుభ్రతపై అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు ప్రారంభించారు. విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఆయన వర్సిటీ పరిసరాలను శుభ్రం చేయించారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

➩ తోటపల్లిగూడూరు: స్వచ్ఛంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ సహకరించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నరుకూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మల్లికార్జున చౌదరి తదితరులు పాల్గొన్నారు.

➩ మనుబోలు: స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ సందర్భంగా మండలంలోని కాగితాలపూరు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. సర్పంచ్ ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి చెంచమ్మ గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చీపుర్లు చేతబట్టి వీధులను శుభ్రం చేసి చెత్తను కొత్తగా నిర్మించిన డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లలో పోగయ్యే చెత్తను బయట వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. దానిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. అక్కడ కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు విక్రయిస్తామని తెలిపారు. అలాగే మనుబోలులో ఎంపీడీఓ జలజాక్షి, ఎంపీపీ వజ్రమ్మ, పంచాయతీ కార్యదర్శి గరుడయ్య తదితరులు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. వివిధ శాఖల అధికారుంతా ప్రతిజ్ఞ చేశారు.

➩ కొడవలూరు: స్వచ్ఛాంధ్ర సాకారం కావాలంటే పరిశుభ్రత ప్రతి ఇంటి నుంచే ప్రారంభంకావాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. నేతలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున, ప్రవీణ్‌కుమార్, రమణారెడ్డి, సిద్ధార్థ, కిరణ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

➩ బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని వాసవినగర్‌లో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్ నిర్వహించారు. ప్లాస్టిక్ వద్దు.. వస్త్ర సంచి ముద్దు అని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.



వెంకటాచలం: వీఎస్‌యూలో..



బుచ్చిరెడ్డిపాళెంలో..



మనుబోలులో..



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..



మనుబోలు: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు